సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 2 । జనవరి । 2024



కోటి ఆశలతో...

కోటి ఆశలతో కొత్త వత్సరానికి స్వాగతం పలికింది విశాఖ. ఈస్ట్ పాయింట్ కాలనీలోని షిర్డీ సాయి ఆలయంలో సాయినాథుడు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. బాబాకు పండ్లు, స్వీట్లు నివేదించారు.

– ఏయూ క్యాంపస్

న్యూస్‌రీల్

రేంజ్ ఐజీగా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ



ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం ఎంతో అవసరమని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను సోమవారం తన చాంబర్‌లో ఆ సంఘం ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి కుమారి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ డీ. గోపినాథ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దు శ్రీను, నాగేశ్వరరావు, నాయకులు ఫణి, ప్రభాకర్ , మురళీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమ్మె విరమించుకోవాలి

బీచ్‌రోడ్డు: అంగన్‌వాడీ కార్యకర్తలు,సహాయకుల సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయి కాబట్టి సమ్మె విరమించుకొని, విధుల్లో చేరాలని కలెక్టర్ మల్లికార్జున ఒక ప్రకటనలో సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బరువు తక్కువతో ఇబ్బంది పడుతున్న ఐదేళ్లలోపు చిన్నారులకు సరైన పోషకాహార అందడం లేదని, ఈ నేపథ్యంలో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే విధుల్లో చేరాలన్నారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని, ఇప్పటికే రాష్ట్ర మంత్రులు అనేక సార్లు చర్చలు జరిపి ప్రధాన డిమాండ్లను పరిష్కరించారన్నారు. జనవరి 5లోగా సమ్మె విరమించుకొని విధుల్లో చేరాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.

జోన్‌-4లో బహిరంగ వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్‌-4 పరిధి సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్‌లోని ఆశీలు వసూలు చేసేందుకు షరతులకు లోబడి మార్చి 31తేదీ వరకు గుత్తకు ఇచ్చేందుకు ఈ నెల 10వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో అనుమతి పొందిన వారిచే బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు బహిరంగ వేలంలో సంబంధిత ధ్రువ పత్రాలతో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు జోన్‌-4 కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకుడ్ని సంప్రదించాలని జోనల్ కమిషనర్ తెలిపారు.

వెల్‌కమ్ టు వైజాగ్



అందాల విశాఖ



విశాఖకు రాబోతున్న ఒబెరాయ్ హోటల్

- పర్యాటకుల తాకిడితో ఈ ఏడాది ఉమ్మడి విశాఖలో ఉత్సాహం
- 1.71 కోట్ల మంది టూరిస్టుల రాక
- పర్యాటక ప్రాంతాలకు వచ్చిన 40,749 మంది విదేశీయులు
- పర్యాటకులను ఆకట్టుకునేలా కొత్త ప్రాజెక్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది మరింత ఫుట్‌ఫాల్ పెరిగేందుకు అవకాశాలు



అనంతగిరిలో రిసార్టులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం ప్రాజెక్టులు **64**

మొత్తం నిధులు రూ.**8,806.44** కోట్లు

ఉపాధి కల్పన **18,205** మందికి

2023లో జిల్లాను సందర్శించిన పర్యాటకుల వివరాలివీ...

నెల	స్వదేశీ పర్యాటకులు	విదేశీ పర్యాటకులు	మొత్తం
జనవరి	15,24,303	2,416	15,26,719
ఫిబ్రవరి	12,47,028	3,665	12,50,693
మార్చి	12,92,904	3,881	12,96,785
ఏప్రిల్	13,97,610	3,141	14,00,788
మే	14,62,051	3,158	14,65,240
జూన్	14,55,946	2,476	14,58,453
జూలై	15,61,177	3,157	15,64,347
ఆగస్ట్	13,57,313	2553	13,59,866
సెప్టెంబర్	12,40,029	2,484	12,42,676
అక్టోబర్	16,33,198	3,551	16,36,778
నవంబర్	14,03,131	4,370	14,07,524
డిసెంబర్	15,62,745	5,897	15,68,642
మొత్తం	1,71,37,435	40,749	1,71,78,184

సాక్షి, విశాఖపట్నం : అందాల విశాఖ జిల్లా.. పర్యాటక రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. కోవిడ్ తర్వాత ఎన్నడూ రానంతగా దేశ, విదేశీ పర్యాటకులు క్యూ కడుతున్నారు. వివిధ దేశాల నుంచి జిల్లాలో ప్రకృతి రమణీయతను సందర్శించే వారి సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. 2023 సంవత్సరంలో ఏకంగా 1.71 కోట్ల మంది పర్యాటకులు విశాఖ అందాలను వీక్షించారు. కొత్త కొత్త పర్యాటకులకు వారి అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కొత్త ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి. గతంతో పోలిస్తే.. ఈ ఏడాది వచ్చిన పర్యాటకుల సంఖ్య పెరిగిందని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. కోవిడ్ తర్వాత పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్న తరుణంలో గత మూడేళ్ల కాలంతో పోలిస్తే.. 2023లో ఫుట్‌ఫాల్ ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఉపాధి పుష్కలం

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగగా ఇందులో సగం వరకూ అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8806. 44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ వంటి హోటల్స్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. త్వరలోనే మిగిలిన ప్రాజెక్టులూ పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉన్నాయి.

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు రానున్నాయి. అల్లూరి జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోనూ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది.

విశాఖ–అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ కుజిన్ రెస్టారెంట్స్ కూడా రాబోతున్నాయి.

పర్యాటక ప్రాజెక్టుల రాకతో కళకళ

పెరుగుతున్న పర్యాటకానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పర్యాటక శాఖ సిద్ధమవుతోంది. డొమెస్టిక్‌తో పాటు విదేశీయులను మెప్పించే విధంగా ఆహారంతో పాటు సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గతేడాది మార్చిలో జరిగిన జీఐఎస్‌-2023లో విశాఖలో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు కీలక ఎంవోయూలు జరిగాయి. ఉమ్మడి విశాఖజిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులతో రూ.8800 కోట్లకుపైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

కొత్త ప్రాజెక్టులతో మరింత కళ



సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విభిన్నమైన ఒప్పందాలు చేసుకుంది. ఇప్పటికే అన్నవరంలో దిగ్గజ సంస్థ ఒబెరాయ్ తమ ప్రాజెక్టు ప్రారంభించేందుకు 40 ఎకరాలు కూడా సిద్ధమయ్యాయి. అదేవిధంగా.. పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో భూ కేటాయింపు ప్రక్రియ చురుగ్గా కదులుతోంది. వీలైనంత త్వరగా ప్రాజెక్టులు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. చాలా సంస్థలు విశాఖలో తమ పర్యాటక వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు ఆసక్తి చూపించాయి. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి దేశ విదేశీ సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్

‘సంజీవని’కి సలాం..!



డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగుల తరఫున చెక్కు అందిస్తున్న ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, చిత్రంలో జేసీ విశ్వనాథన్

- కలెక్టర్ చొరవతో.. నిరుపేదలకు ఆపన్నహస్తం
- సంజీవని నిధి పేరుతో డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్
- న్యూ ఇయర్ రోజున వెల్లువెత్తిన ఉదారత
- స్వచ్ఛందంగా రూ.14,22,368ల విరాళాలు

సాక్షి, విశాఖపట్నం : చేయూతనందిస్తే తప్ప.. ఏ సాయాన్ని పొందలేని అభాగ్యులు, నిరాశ్రయులు, నిరుపేదలను ఆదుకునేందుకు కలెక్టర్ చూపించిన వినూత్న చొరవ అద్భుత ఫలితాలను అందిస్తోంది. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించేందుకు గతేడాది జనవరిలో కలెక్టర్ డా.మల్లికార్జున ‘సంజీవని నిధి’ పేరుతో డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌ను ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల నుంచి సంజీవని నిధికి విశేష స్పందన లభించింది. వచ్చిన నిధులతో మంచి కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ న్యూ ఇయర్ సందర్భంగా మరోసారి సంజీవని నిధికి విరాళాలిచ్చి.. అభాగ్యులపై ప్రేమను కురిపించాలని కలెక్టర్ ఇచ్చిన పిలుపు మేరకు.. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉదారతను చూపించి మొత్తంగా రూ.14.22 లక్షల విరాళాలు అందించారు. జీవితంలో ఏదో ఒక మంచి పని చెయ్యాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. ఆ మంచి ఎదుటివారి మేలు కోరేలా వారి జీవితాలకు చేయూతనందించేలా ఉండాలన్నదే ప్రతి ఒక్కరి ఆలోచన. ఆ ఆలోచనకు ఒక రూపమిస్తూ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున రాష్ట్ర స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ మాదిరిగా.. జిల్లా స్థాయిలో ‘సంజీవని నిధి’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎవరికి తోచిన సాయాన్ని వారు సంజీవని నిధికి అందిస్తే ఆ డబ్బులతో కష్టాల్లో ఉన్న వారికి సాయమందించేందుకు వినియోగించాలన్న మంచి ఉద్దేశంతో కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపేందుకు తన వద్దకు వచ్చేవారు.. స్వీట్లు, బొకేలు, పండ్లు తీసుకురావద్దని, శక్తి మేర సంజీవని నిధికి విరాళమివ్వాలని గతేడాది పిలుపునిస్తూ మొదలు పెట్టారు. అప్పటి నుంచి మంచి స్పందన లభించింది. ఈ ఇయర్ కూడా.. ప్రభుత్వ ఉద్యోగులు తోచిన సాయం చేస్తూ.. నిధిని మరింత పెంచారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేలా...

అనాథలు, దివ్యాంగులు, బుద్ధిమాంద్యం పిల్లలు, హెచ్‌ఐవీ, కుష్టు బాధితులు, అసాధారణ, ప్రత్యేక సందర్భాల్లో వైద్య ఖర్చులు అవసరమైన వారికి ఈ సంజీవని నిధిని వినియోగించాలన్నదే దీని ముఖ్య ఉద్దేశం. ఈ ఉద్దేశానికి అనుగుణంగా ఇందులోకి వచ్చిన విరాళాలను కలెక్టర్ ఉదారంగా అందిస్తూ.. వారిని ఆదుకుంటున్నారు. కోవిడ్ ప్రభావిత పిల్లలకు సహాయం, అనాథ పిల్లలకు విద్య, పేద, మెరిట్ విద్యార్థులకు స్పెషల్ ఎడ్యుకేషన్ అందించేందుకు మద్దతునందించారు. ఎవరికైనా సాయం కావాలంటే కలెక్టరేట్ ఆవరణలో దరఖాస్తును ఫిర్యాదుల విభాగంలో అందజేయాలి. వాటిని కలెక్టర్ పరిశీలించి విచారణ నిర్వహించి కచ్చితంగా అవసరమని అనుకుంటే వెంటనే సాయమందిస్తున్నారు.

ఈ న్యూ ఇయర్ రోజున వచ్చిన విరాళాలు..

- కలెక్టర్ మల్లికార్జున తన ఒక నెల జీతం రూ.1,10,000 అందజేశారు.
- కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది రూ.12,000 విరాళమిచ్చారు.
- రెవెన్యూ డిపార్టుమెంటులో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగులు రూ.3,85,000 అందించారు.
- వీఎంఆర్డీఏ ఉద్యోగులు రూ.1,79,523
- విద్యాశాఖ రూ.1,05,000
- ఆరోగ్య శాఖ రూ.95,000
- పశు సంవర్ధక శాఖ రూ.50,000
- జిల్లా పరిషత్ విభాగం రూ.50,000
- కో–ఆపరేటివ్ విభాగం రూ.50,000
- ఆఫీసర్స్ క్లబ్, విశాఖపట్నం రూ.1,00,000
- వివిధ శాఖల ఉద్యోగులు రూ.2,85,845
- మొత్తం వచ్చిన విరాళాలు– రూ.14,22,368

ఉద్యోగులు ముందుకొస్తున్నారు



సంజీవని నిధికి విరాళాలందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నతంగా ముందుకొస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇందులో వచ్చిన నిధులతో మంచి కార్యక్రమాలు నిర్వహించాం. ఉదాహరణకు గతేడాది రూ.17 లక్షల వరకూ వచ్చాయి. వీటిలో 512 మంది ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు రూ.1.34 లక్షలు వినియోగించి నిర్మయ హెల్త్ స్కీమ్‌లో భాగంగా ఆరోగ్య బీమా చేశాం. వివిధ ఇబ్బందులతో బాధపడుతున్న ఏడుగురికి రూ.1.30 లక్షలు అందించాం. ఇలా మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నాం. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి విరాళాలు అందించాలనుకుంటే సంజీవని–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ పేరుతో డీడీలు, చెక్కులు రూపంలో విరాళాలు ఇవ్వాలని కోరుతున్నాం.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

నేటి నుంచి 2వ విడత ‘ఆరోగ్య సురక్ష’

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) 2వ విడత కార్యక్రమం జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపా రు. ఈ నెల 2 నుంచి జూన్ 30 వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సోమవారం ఆయన వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 551 పట్టణ ప్రాంతాలు, 54 మండలాలతోపాటు ఆనందపురం, పద్మనాభం హెడ్ క్వార్టర్స్‌లో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రతి మండలంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో రెండు శిబిరాలు, పట్టణ ప్రాంతంలో ప్రతి బుధ, గురువారాల్లో రెండు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

వైద్య శిబిరాలకు సర్వం సిద్ధం

మంగళవారం నుంచి జరగనున్న ఉచిత వైద్య శిబిరాలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. తొలిరోజు రూరల్‌లోని పద్మనాభం అయినాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆనందపురం వెల్లంకి ఆరోగ్య కేంద్రం, భీమిలి మండలం చిప్పాడ పీహెచ్‌సీల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం అర్బన్ పరిధిలోని 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయని చెప్పారు. అర్బన్, రూరల్ ఆరోగ్య కేంద్రాల వద్ద జరిగే ఈ క్యాంపుల కోసం రిజిస్ట్రేషన్ కౌంటర్, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 72 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. అర్బన్‌లో 172 రకాలు, గ్రామీణ ప్రాంతంలో 92 రకాల మందులను సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

రూ.3 వేల పింఛన్.. ఆనందం పంచెన్

- కొత్త ఏడాది కానుకగా పెరిగిన పెన్షన్ల పంపిణీ
- లబ్ధిదారుల కళ్లల్లో సంతోషం



వృద్ధుడికి రూ.3 వేల పెన్షన్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: వైఎస్సార్ పెన్షన్ కానుక పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా లబ్ధిదారులకు అందిస్తున్న పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలకు పెంచిన పెన్షన్ సొమ్మును మొదటి సారిగా లబ్ధిదారులు అందుకున్నారు. పెరిగిన పెన్షన్లు కొత్త ఏడాది కానుకగా ఒకటో తేదీ ఉదయాన్నే అందుకోవడంతో పింఛన్‌దారుల కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది.

పింఛన్ పెంపుతో ఎంతో మేలు: కె.కె.రాజు

జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే తలుపు తట్టి లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని, రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీవో పద్మావతి, సీవో ధనలక్ష్మి, స్థానిక నాయకులు బైర వెంకట్, జక్కంపూడి సత్యనారాయణ, సూరాబత్తుల తిరుపతిరావు, బాద శ్రీనివాస్, కంచు పద్మశేఖర్, రంజాన్ వలి, ఎస్.నరసయ్య, గరికిన రమ, బంగారమ్మ, ఆదారి పద్మ, అలివేణి, కమల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పింఛన్ నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పింఛన్ పెంపు చరిత్రాత్మకం

భీమునిపట్నం : రూ. 3 వేల పెన్షన్ పెంపు చరిత్రాత్మకమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. దేశం గర్వించేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురికి పెన్షన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అద్భుతంగా జరిగాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో అవస్థలు పడేవారన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందిస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు.

పెన్షనే ఆధారం



భర్తకు దూరంగా ఉంటున్నా. జగనన్న ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి నాలుగున్నరేళ్లుగా ఒంటరి మహిళ పెన్షన్ అందుకుంటున్నాను. ప్రభుత్వ పథకాలు, నా తోబుట్టువు సాయంతో పిల్లలిద్దరినీ కష్టపడి చదివిస్తున్నాను. బాబు, పాప ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతున్నారు. నా పిల్లలు పెద్ద చదువులు చదువుతున్నారంటే సీఎం వైఎస్ జగనే కారణం. తొలిసారి రూ.3 వేల పెన్షన్ అందుకున్నాను. ఎంతో ఆనందంగా ఉంది.

– శనివాడ వెంకటలక్ష్మి, నరేంద్రనగర్, 43వ వార్డు

పింఛన్ సొమ్ముతోనే కుటుంబ పోషణ



నా వయసు 70 ఏళ్లు దాటింది. భార్యతో కలిసి ఉంటున్నాను. నేను ఏ పనీ చేయలేను. నా భార్య ఆరోగ్యం కూడా సరిగా లేదు. మా అబ్బాయి ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పెన్షన్ ఈ రోజు అందుకున్నాను. చాలా ఆనందంగా ఉంది.

– తేలు సన్యాసిరావు, వెంకటేశ్వర కాలనీ, 43వ వార్డు



క్లుప్తంగా

మరో 10 మందికి కరోనా

మహారాణిపేట: విశాఖలో సోమవారం మరో 10 మందికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 90 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 10 మందికి నిర్ధారణ అయింది. 20 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా..13 డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

ముగిసిన ఏకపాత్రాభినయ పోటీలు



పద్య నాటక పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పీఎం పాలెం: శిల్పారామం(జాతర) ఆడిటోరియంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర కళాకారుల ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం 7వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 22 మంది కళాకారులు పోటీ పడి ప్రదర్శించారు. రాజాంకు చెందిన బండి కుమారి హరిశ్చంద్ర నాటకంలోని చంద్రమతి పాత్రకు ప్రథమ బహుమతి, పార్వతీపురానికి చెందిన నక్షత్ర పాత్రధారి తూడి భాస్కరరావుకు ద్వితీయ, కల్యాణి పిగకల సీను సత్యహరిశ్చంద్ర నాటకంలో నటనకు బహుమతులు అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న నటులందరికీ మెమెంటోలు బహూకరించి సత్కరించారు. చివరగా ప్రదర్శించిన నక్కీర, సత్యహరిశ్చంద్ర నాటకాలు ఆహూతులను అలరించాయి. పౌరాణిక పద్యనాటక రంగానికి విశేష సేవలు అందించిన కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు, కళారత్న అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్, కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి నల్ల నయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మహా' బడ్జెట్ రూ.5614 కోట్లు

- ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు
- అన్ని పద్దుల కింద జమలు రూ.4949.89 కోట్లు
- ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.5614.22 కోట్లు
- అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5457.23 కోట్లు
- ముగింపు నిల్వ రూ.156.99 కోట్లు
- త్వరలో కౌన్సిల్ ముందుకు 2024-25 జీవీఎంసీ బడ్జెట్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఇటీవల స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదించారు. త్వరలోనే కౌన్సిల్ సమావేశం నిర్వహించి కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి చర్చకు రానుంది. జీవీఎంసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన అంచనా బడ్జెట్‌ను అధికారులు స్థాయి సంఘంలో ప్రవేశపెట్టారు. స్థాయి సభ్యులు సవరించిన బడ్జెట్‌ను సుదీర్ఘంగా చర్చించి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఆమోదం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభపు నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4949.89 కోట్లు. ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తంగా జమలు రూ.5614.22 కోట్లు కాగా.. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.5457.23 కోట్లు. ముగింపు నిల్వగా రూ.156.99 కోట్లుగా నిర్ణయించారు.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం

రెవెన్యూ రిసీప్ట్స్.. ఖర్చులు

సాధారణ పద్దు కింద రూ.981.69 కోట్లు. ఖర్చులు రూ.79.59 కోట్లు. ఇంజినీరింగ్ రిసీప్ట్స్ రూ.49.26 కోట్లు. ఖర్చులు రూ.486.81 కోట్లు. లైటింగ్ విభాగానికి సంబంధించి ఖర్చులు రూ.132.05 కోట్లు. ప్రాజెక్టు ఖర్చులు రూ.29.45 కోట్లు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రూ.327.64 కోట్లు రిసీప్ట్స్ కాగా, రూ.13.41 కోట్లు ఖర్చులుగా చూపారు. యూసీడీ ప్రాజెక్ట్స్‌కి సంబంధించి రూ.12.24 కోట్లు ఖర్చులుగా చూపారు. విద్యా విభాగానికి సంబంధించి రూ.4.94 కోట్లు, పార్కులు, లీజర్స్, శ్మశానాల ఖర్చుల కింద రూ.128.65 కోట్లు చూపారు.

పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి రూ.120.20 కోట్లు జమలు చూపగా, రూ.491.41 కోట్లు ఖర్చుల కింద చూపారు. మంచినీటి విభాగానికి సంబంధించి రూ.419.10 కోట్లు జమలు కాగా, రూ.272.02 కోట్లు ఖర్చులు. డిపాజిట్లు, అడ్వాన్సులు కింద జమలు రూ.13 లక్షలు కాగా, ఖర్చుల కింద రూ.78 లక్షలుగా చూపారు.

క్యాపిటల్ రిసీట్స్, ఖర్చులు

సాధారణ పద్దు కింద జమలు రూ.33 కోట్లు. ఖర్చులు రూ.96.50 కోట్లు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి జమలు రూ.709.85 కోట్లు. ఖర్చులు రూ.879.55 కోట్లు. లైటింగ్ విభాగానికి సంబంధించి రూ.31.60 కోట్లు ఖర్చుగా చూపారు. ప్రాజెక్ట్స్‌కి సంబంధించి జమలు రూ.844.10 కోట్లు. జమలు రూ.1017 కోట్లు. పట్టణ ప్రణాళికా విభాగం క్యాపిటల్ రిసీట్స్ రూ.5.30 కోట్లు కాగా, ఎక్స్‌పెండిచర్‌గా రూ.50 కోట్లు చూపారు. యూసీడీ ప్రాజెక్ట్స్ జమలు రూ.13.50 కోట్లు. ఖర్చులు రూ.21.50 కోట్లు. విద్యా విభాగానికి సంబంధించి జమలు రూ.15 లక్షలు చూపగా, ఖర్చులు రూ.55 లక్షలుగా చూపారు. పార్కులు, లీజర్లు, శ్మశానాలకు సంబంధించి జమలు రూ.20 కోట్లు. ఖర్చులు రూ.52.70 కోట్లు. పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి రూ.34.70 కోట్లు ఖర్చులుగా చూపారు. మంచినీటి విభాగానికి సంబంధించి రూ.43.05 కోట్లు జమలు కాగా, రూ.87.97 కోట్లు ఖర్చులుగా చూపారు. అమృత్ కింద జమలు రూ.312 కోట్లు. ఖర్చులు రూ.504 కోట్లు. ఇతర నిధులతో ప్రాజెక్టుల జమలు రూ.191.05 కోట్లు. ఖర్చులు రూ.191.05 కోట్లు. ఆర్థిక సంఘం నిధుల జమలు రూ.586.25 కోట్లు. ఖర్చులు రూ.498.40 కోట్లుగా, డిపాజిట్లు, అడ్వాన్సుల జమలు రూ.293.62 కోట్లు, ఖర్చులు రూ.340.36 కోట్లుగా చూపారు.

బడ్జెట్ అంచనాలు ఇలా..

- సాధారణ పద్దు కింద జమలు రూ.1014.69 కోట్లు. ఖర్చులు రూ.176.09 కోట్లు.
- ఇంజినీరింగ్ విభాగం జమలు రూ.759.11 కోట్లు. ఖర్చులు రూ.1366.36 కోట్లు.
- లైటింగ్స్‌కి సంబంధించి జమలు లేకపోగా ఖర్చులు రూ.163.65 కోట్లు.
- ప్రాజెక్టు కింద జమలు రూ.844.10 కోట్లు. ఖర్చులు రూ.1046.45 కోట్లు.
- టౌన్‌ప్లానింగ్ జమలు రూ.332.94 కోట్లు. ఖర్చులు రూ.63.41 కోట్లు.
- యూసీడీ ప్రాజెక్ట్స్ జమలు రూ.13.50 కోట్లు. ఖర్చులు రూ.33.74 కోట్లు.
- విద్యా విభాగానికి సంబంధించి జమలు రూ.15 లక్షలు. ఖర్చులు 5.49 కోట్లు.
- పార్కులు, లీజర్స్, శ్మశానాలక సంబంధించి రూ.20 కోట్లు జమలు కాగా, ఖర్చులు రూ.181.35 కోట్లు.
- పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి రూ.120.20 కోట్లు జమలు కాగా, ఖర్చులు రూ.526.11 కోట్లు.
- వాటర్ సప్లై విభాగానికి సంబంధించి జమలు రూ.462.15 కోట్లు. ఖర్చులు రూ.359.99 కోట్లు.
- అమృత్ కింద జమలు రూ.312 కోట్లు. ఖర్చులు రూ.రూ.504 కోట్లు.
- ఇతర నిధులతో ప్రాజెక్టుల జమలు రూ.191.05 కోట్లు, ఖర్చులు రూ.191.05 కోట్లు.
- ఆర్థిక సంఘం నిధుల జమలు రూ.586.25 కోట్లు. ఖర్చులు రూ.498.40 కోట్లు
- డిపాజిట్లు, అడ్వాన్సులు రూ.293.75 కోట్లు. ఖర్చులు రూ.341.14 కోట్లు

త్వరలోనే కౌన్సిల్ ముందుకు..



2024-25 వార్షిక బడ్జెట్‌ను స్థాయి సంఘం సభ్యులు చర్చించి ఆమోదించినప్పటికీ త్వరలోనే నిర్వహించిన జీవీఎంసీ బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ ముందుకు చర్చకు రానుంది. ఏయే పద్దు కింద ఎంతెంత జమలు, ఖర్చులకు సంబంధించి అధికారులతో చర్చించాం. అనంతరం స్థాయీ సంఘ సభ్యులు కూడా సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభపు నిల్వ రూ.664.33 కోట్లు. అన్ని పద్దుల కింద జమలు రూ.4949.89 కోట్లు. ప్రారంభంపు నిల్వతో కలిసి మొత్తంగా జమలు రూ.5614.22 కోట్లు.

– గొలగాని హరివెంకటకుమారి, మేయర్, జీవీఎంసీ

● న్యూ ఇయర్ వేళ..

సంపత్ వినాయక ఆలయంలో..



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే అల్లిపురంలో కల్వరి బాప్టిస్టు చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యువతీ యువకులు క్రీస్తు పాటలు ఆలపించారు.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



అల్లిపురంలో కల్వరి బాప్టిస్టు చర్చిలో..

రైతులకు సకాలంలో రుణాలు

డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు



కేక్ కట్ చేస్తున్న కోలా గురువులు

విశాఖ విద్య: రైతులకు అవసరమైన రుణాలను సకాలంలో అందించనున్నట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కోలా గురువులు తెలిపారు. సోమవారం మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన న్యూ ఇయర్ కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బ్యాంకు వ్యాపారం రూ.2,500 కోట్లకు పెరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. రుణాల మంజూరులో నిబంధనలు మరింత సరళతరం చేస్తూ, అధికార వికేంద్రీకరణకు అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, జనరల్ మేనేజర్లు డి.అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, డీజీఎంలు, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Furthier Studies and Abroad. Ph : 83417 74299 [V- 796960]

Real Estate

FLAT FOR SALE

■ Chinamushidiwada Near BRTS Road, VUDA E/Facing 4 B/R Car Parking Duplex House 71 Sqyds Direct Party Only. Ph : 98660 54305 [V- 2329]

PLOT FOR SALE

■ విశాఖపట్నం ఆర్థిక రాజధానిలో VMRDA Approved Plots for Sale 200 feet Road Facing Atchutapuram Yelamanchili Road Facingలో కమర్షియల్ Plots for Sale 1275 Sqyds 200 Feet Road Facing. 86397 65271 [V-2328]

■ న్యూ ఇయర్ ఆఫర్ Reg ఫ్రీ. GVMC పరిధిలో 5 లక్షలకే 111 గజాలు ఇల్లు కట్టుకొనేలా 150 బిట్లు, EMI కలదు. ఫోన్ : 80196 24319 [V-796965]

■ ఫ్లాష్ న్యూస్... ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు & 150 అ॥రోడ్‌కి దగ్గరలో కామవరం ఊరుకి చేరువలో గజం కేవలం రూ.4,500/-కే ఇళ్ళ స్థలాలు అమ్మకం. సంప్ర : 89859 66938 [V- 1896]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11342]

పేరు మార్పు

నేను మొహమ్మద్ షాహిద్ S/o మొహమ్మద్ వాసీ, డోర్‌నెం. 2-32/4, పాలిపేట, పెద్ద నరవ, రామాలయం ఎదురుగా, నరవ, గోపాలపట్నం, విశాఖపట్నం-530027, ఆంధ్రప్రదేశ్. నా పేరు మొహమ్మద్ షహిద్ (పాత పేరు) నుండి మొహమ్మద్ షాహిద్ (కొత్త పేరు)గా మార్చడం. ఇక నుండి నన్ను మొహమ్మద్ షాహిద్ (కొత్త పేరు)గా పిలువగలరు.

పేరు మార్పు

నేను మొహమ్మద్ వాసీ S/o మొహమ్మద్ షరుద్దీన్, ఫ్లాట్ నెం. 658, 13/965, ముస్తాఫా కోలనీ, ఆరిలోవ, విశాఖపట్నం - 530040, ఆంధ్రప్రదేశ్. నా పేరు మొహమ్మద్ వాసి (పాత పేరు) నుండి మొహమ్మద్ వాసీ (కొత్త పేరు)గా మార్చడం. ఇక నుండి నన్ను మొహమ్మద్ వాసీ (కొత్త పేరు)గా పిలువగలరు.

SEPTIC TANK CLEAN

■ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా అతి తక్కువ ఖర్చుతో 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 27171 [V-2332]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167580]

■ సువర్ణభూమి సంస్థలో పార్ట్ టైం / ఫుల్ టైం పనిచేయుటకు హౌస్ వైఫ్స్ రిటైర్డ్ పర్సన్స్ కావలెను. మంచి ఇన్సెంటివ్ + కమీషన్ కలదు. కోటీశ్వరులు అవ్వాలనుకునే వారికి మంచి అవకాశం. ఫోన్ : 96662 82005 [V-11497]

■ రెడీమేడ్‌షాపులో పనిచేయుటకు సేల్స్ స్టాఫ్ కావలెను. లేడీస్‌క జీ : 9,000/- + కమీషన్ + 4 రోజులు = 11,000/-. జెంట్స్ జీ : 10,000/- + కమీషన్ + 4 రోజులు = 12,000/-. పవన్ షోరూమ్, 5th లైన్, ద్వారకానగర్, వైజాగ్-16. ఫోన్ : 94408 02452, 94406 02456 [V-1355]

■ మేనేజర్స్ (M/F) కావలెను. అర్హత : MBA, MCA & Degree. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఫోన్ : 99491 29054, 93474 73257 [V-1909]

■ ప్రముఖ విద్యా సంస్థ కొరకు డేటా కలక్షన్ టీమ్, ఫీల్డ్ సూపర్‌వైజర్స్, ఆయాలు మరియు టీచర్స్ అర్జెంట్‌గా కావలెను. స్త్రీలు మాత్రమే. గాజువాక / కూర్మన్నపాలెం. ఫోన్: 70367 67527 [V-6355]

CHANGE OF NAME

I, MATHURUTHI JYOTHI (old name) D/o. Mathuruthi Eswara Rao, W/o. Nakka Satya Rao, residing at D.No. 34-15-35/1, Manuvallu Street, Gnanapuram, Visakhapatnam, AP. have changing my name from MATHURUTHI JYOTHI (old name) to NAKKA JYOTHI ROY (new name). Henceforth I am being called as NAKKA JYOTHI ROY for all purposes.

■ Wanted Restaurant Waiters Service Staff, Cleaning Staff. Lawsons Bay Colony. Cont : 96404 26789 [V-2941]

■ భాష్యం ఫార్మసీ నందు పనిచేయుటకు మినిమం 5సంవత్సరాలు(తప్పనిసరి) మెడికల్ షాప్ అనుభవం కల ఫార్మసిస్ట్‌లు కావలెను. వర్క్ లోకేషన్: విశాఖపట్నం సిటీ. 9440079424 [G-8416]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k సంప్ర: 9160900024 / 9640400073. [HA-1035]

సినిమా వార్తల కోసం లాగ్‌ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నిచర్స్, ఆటోమొబైల్స్, కంప్యూటర్స్, సర్వీసెస్, కావలెను

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరంలోకి..

జిల్లాలో సందడిగా న్యూ ఇయర్ వేడుకలు

మహారాణిపేట: జిల్లాలో 2024 నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. ప్రభుత్వ కార్యాలయాలు సందడిగా కనిపించాయి. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆయనను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, డీసీపీ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దివ్యాంగులు, నాలుగో తరగతి ఉద్యోగులు కలిసి కలెక్టర్‌ను సన్మానించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహారాణిపేట: జిల్లా రెవెన్యూ అసోసియేషన్ రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఏవో ఈశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

డీఐజీ కార్యాలయంలో..

సాక్షి, విశాఖపట్నం: నూతన సంవత్సరం-2024కు స్వాగతం పలుకుతూ పెదవాల్తేరులోని డీఐజీ కార్యాలయంలో ఐజీ హరికృష్ణ కేక్ కట్ చేశారు. అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణతో పాటు పలువురు పోలీసు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో..

విశాఖ సిటీ: ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సోమవారం పోలీసులు న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ కేక్ కట్ చేసి పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) పల్లా వెంకటరత్నం, డీసీపీ బి.లక్ష్మీనారాయణ, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ మల్లికార్జునకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దివ్యాంగులు



ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులకు వివిధ అనుబంధ విభాగాల నాయకులు అల్లంపల్లి రాజాబాబు, రమణకుమారి, భాస్కరరావు, కృష్ణంరాజు, సురేష్, చిన్నతల్లి, భర్కత్ ఆలీ, వెంకటరమణరెడ్డి తదితరులు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జేసీ బంగ్లాలో..

మహారాణిపేట: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా జేసీ కె.ఎస్.విశ్వనాథన్ తన కార్యాలయంలో సోమవారం మొక్కలు నాటారు. పలువురు ఉన్నతాధికారులు జేసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మొక్క నాటుతున్న జేసీ విశ్వనాథన్, పలువురు అధికారులు

ప్రపంచ ఖ్యాతే లక్ష్యంగా విశాఖ నగరాభివృద్ధి

దాబాగార్డెన్స్: ప్రజలకు మెరుగైన సేవలతో పాటు ప్రపంచ ఖ్యాతే లక్ష్యంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. 2024లో మరిన్ని మెరుగైన ప్రాజెక్టుల అభివృద్ధికి జీవీఎంసీ కృషి చేస్తుందని కమిషనర్ తెలిపారు.

పారిశుధ్య పనుల నిర్వహణకు చర్యలు

మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా నగరంలో పారిశుధ్యం పనుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసీ కార్మికుల అవసరాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమ్మె కాలంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా తమ వంతు బాధ్యతగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన డంపర బిన్‌లలో వ్యర్థాలు వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్

మేయర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

మేయర్ గొలగాని హరివెంకటకుమారిని సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కలిసిన పలువురు కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, జీవీఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్లు, సిబ్బంది, పలు సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేయర్ ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు, గుమ్మడి నరసింగరావు, కారె ఎల్లయ్య, డొక్కర పోలరావు, వెంకునాయుడు, తాతారావు, వెంకట్రావు, ఎల్లారావు, సూరిబాబు పాల్గొన్నారు.



స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ (డబ్ల్యూఎంపీఎస్‌సీ) సహకారంతో ప్లంబర్లకు ఒక రోజు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. హిండ్‌వేర్ సంస్థ సహకారంతో శిక్షణ అనంతరం స్కిల్ ఇండియా సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. నేక్ శిక్షణా కేంద్రం, గాజువాకలో శిక్షణ ఇస్తామన్నారు. స్టేషనరీ ఉచితంగా ఇస్తామని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు ఎటువంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదని, మహిళా అభ్యర్థులు కూడా అర్హులే అని రవికుమార్ వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 91332 42666 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మెట్లపై నుంచి జారి పడి వైద్యుడి దుర్మరణం



మృతుడు సారిపల్లి కల్యాణ్ చక్రవర్తి

సీతమ్మధార : కుటుంబ సభ్యుల మృతితో బాధపడుతున్న స్నేహితులను పరామర్శించడానికి బెంగళూరు నుంచి వచ్చిన ఓ వైద్యుడు మెట్లు దిగుతూ ప్రమాదశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బెంగళూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ సారిపల్లి కల్యాణ్ చక్రవర్తి (47)యూకేలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ఈయన గత నెల 19న బెంగళూరు నుంచి దొండపర్తిలో ఉంటున్న స్నేహితులు లక్ష్మణ్ సింగ్, శ్యాంసుందర్ నివాసానికి వచ్చారు. ఆదివారం రాత్రి మద్యం సేవించారు. ఆ మత్తులో పై అంతస్తు నుంచి మెట్ల మార్గంలో కిందకి దిగుతుండగా.. ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. స్నేహితులు ఆయనను ఎస్ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చక్రవర్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వుమన్ ఎస్ఐ ప్రమీలా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇంకా పెళ్లికాలేదు. ఈయన తల్లి బెంగళూరులో నివాసం ఉంటోంది.